# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

హన్మకొండ, వరంగల్, జనగాం, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట

శనివారం | 23 మార్చి, 2024 | పేజీలు : 06


## ఎంపీని అధిక మెజార్టీతో గెలిపించండి



వివరాలు మెయిన్‌లో...

## రేషన్ బియ్యం అక్రమంగా తరలిస్తున్న 4 వాహనాలపై ఎన్ ఫోర్స్ మెంట్ మెరుపు దాడులు




**ప్రజాపక్షం/కాళేశ్వరం:** మహారాష్ట్రలోని సిరొంచా తాలూకా కేంద్రంగా తెలంగాణ నుండి రేషన్ బియ్యం అక్రమ దందా రాత్రి,పగలు తేడా లేకుండా నిత్యం నిరాటంకంగా కొనసాగుతున్న విషయం తెలుసుకున్న హైదరాబాద్ సివిల్ సప్లై ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరం వద్ద శుక్రవారం మెరుపు దాడులు నిర్వహించి రెండు లారీలు,రెండు బొలెరో వాహనాలలో అక్రమంగా తరలిస్తున్న సుమారు 700 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని వలపన్ని పట్టుకున్నారు. అనంతరం వాహనాలతో పాటు అందులో అక్రమంగా తరలిస్తున్న సుమారు 700 క్వింటాళ్ళ రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకొని స్థానిక కాళేశ్వరం పోలీస్ స్టేషన్ లో పంచనామా నిర్వహించి పోలీసులకు అప్పగించారు. ఈ దందా నిర్వహిస్తున్న నలుగురిపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.కాగా గత కొద్ది రోజుల క్రితం మహాదేవపూర్ మండల కేంద్రంలో రెండు వాహనాలలో తరలిస్తున్న అక్రమ బియ్యాన్ని స్థానిక యువకులు పట్టుకొని రెవెన్యూ అధికారులకు అప్పగించారు. కాళేశ్వరం అంతర్ రాష్ట్ర వంతెన మీదుగా రేషన్ బియ్యం అక్రమ దందా రాత్రి,పగలు తేడా లేకుండా యదేచ్ఛగా కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుండే వందలాది లారీలలో సరిహద్దు మహారాష్ట్రలోని సిరొంచా కేంద్రంగా ఏర్పాటు చేసుకున్న రేషన్ వీరప్పన్ డెన్ కు నిత్యం స్మగ్లర్లు నిరాటంకంగా చేరవేస్తున్నారు. అక్రమ బియ్యం రవాణా సమయంలో బియ్యం స్మగ్లర్లు ఎక్కడికక్కడ ఏజెంట్ల వ్యవస్థ ఏర్పాటు చేసుకొని రేషన్ అక్రమ దందా కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది రేషన్ మాఫియాగా విస్తరించిన రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు మరిన్ని దాడులు నిర్వహించి రేషన్ అక్రమ తరలింపుపై నియంత్రణ చర్యలు చేపడతారా?లేదా వేచి చూడాల్సిందే.అనేక జిల్లాలోని రైస్ మిల్లుల నుండి రసీదులు, బిల్లుల రూపంలో సహకారం పొందుతున్న కూకటివేళ్లతో పాతుకుపోయిన రేషన్ "వీరప్పన్" వ్యవస్థను పెకిలించడం అంత సులభతరం కాదని పలువురు అనుమానాలు కూడా వ్యక్తం చేస్తున్నారు.

## వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలి

### కలెక్టర్ రాహుల్ రాజ్

**ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా పోచారం లో ఉన్న వన విజ్ఞాన కేంద్రన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా సందర్శించారు. 4.5 కిలో మీటర్ల సఫారీ వాహనం లో అటవీ ప్రాంతం తిరిగి జింకల ప్రత్యుత్పత్తి కేంద్రంను జింకలని, నెమళ్ళు, మనుబోతులు, పక్షులను, ఇతర అటవీ జంతువులను పర్యవేక్షణ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో ఎండలు ఎక్కువగా ఉండడం వల్ల వన్య ప్రాణులకు ప్రత్యేక రక్షణ కల్పించాలని, జంతువులకు ఆహారం, త్రాగు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. వన విజ్ఞాన కేంద్రం ఏర్పాటు, అటవీ విస్తీర్ణం, సందర్శకుల సమయపాలన గురించి అటవీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అటవీ జంతువులకు త్రాగు నీరు, ఆహారం, రక్షణ ఏ విధంగా ఇస్తారు అని అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో మెదక్ ఆర్డీఓ రమాదేవి, హవేలీ ఘనపూర్ మండల్ తహసిల్దార్ నారాయణ, అటవీ సెక్షన్ అధికారి శ్రావణ్ కుమార్, బీట్ ఆఫీసర్ ప్రసాద్ గౌడ్, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.



## కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మృతి బాధాకరం

### మంత్రి సీతక్క

**ప్రజాపక్షం/ఏటూరునాగారం:** పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క మహబూబాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాం నాయక్ ములుగు జిల్లా, ఏటూరునాగారం మండలం, శంకరాజుపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జాడి పుల్లయ్య ఇటీవల హార్ట్ సర్జరీ బ్రెయిన్ సర్జరీ తో హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో మరణించగా శుక్రవారం కుటుంబ సభ్యులను పరామర్శించి చిత్రపటానికి పూలమాల వేసి వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని నివాళులు అర్పించారు. కాంగ్రెస్ పార్టీ తరుపున అండగా ఉంటామని హామీ ఇచ్చినారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు, మండల నాయకులు,బ్లాక్ నాయకులు, గ్రామ నాయకులు, అనుబంధ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## దర్జాగా బావండ్లకుంట కబ్జా... తెరవెనుక దాగున్నది ఎవరు..?

**ప్రజాపక్షం/అక్కన్నపేట:** సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలం వ్యాప్తంగా ఎక్కడ చూసిన ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయింది.ఖాళీ స్థలం కనబడితే చాలు కబ్జా చేస్తున్నారు.అమాయక ప్రజలను మోసం చేస్తూ విక్రయిస్తున్నారు.ప్రభుత్వ భూములను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత శాఖ అధికారులదని ప్రజలు ప్రశ్నిస్తున్నారు.ఒకవేళ తెలిసిన కూడా తెలియనట్లు వ్యవహరిస్తున్నారా..అని ఆశ్చర్యపోతున్నారు.ముడుపులు తీసుకోవడంలో ఉన్న శ్రద్ధ వారి పనితీరుపై లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.కొందరు బడా బాబులు నాయకులతో చేతులు కలిపి ఈ తంతు నడిపిస్తున్నారనే ఆరోపణలు కూడా వస్తున్నాయి..సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండలంలో ప్రభుత్వ భూమి అన్యక్రాంతమవుతున్న విషయం తెలిసి కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు చెబుతున్నారు.మరోవైపు గతంలో జరిగిన అక్రమ పట్టాలపై కక్షిదారులు కాగా అక్కన్నపేట మండల కేంద్రంలోని మర్రి చెట్టు సమీపంలో మత్స్యకారుల ఉపాధికై చేపల ఉత్పత్తికి కేటాయించిన బావండ్ల కుంట శిఖం భూమి కబ్జా గురవడంతోపాటు భారీ హిటాచీతో అనుమతి లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్నారని స్థానికులు అధికారులకు సమాచారం అందించారు.ఈ విషయమై ఆక్రమణదారునిపై శుక్రవారం స్థానిక ముదిరాజ్ మత్స్యకారులు ఇరిగేషన్,రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు.ఇప్పటికైన ఉన్నతాధికారులు స్పందించి మత్స్యకారులు,రైతులకు జీవనాధారమైన ప్రభుత్వ భూములైన చెరువులు,కుంటల భూమిని కబ్జా నుంచి విముక్తి చేసి ప్రజావసరాలకు వినియోగించాలని అక్కన్నపేట ముదిరాజ్ మత్స్యకారులు,మండల ప్రజలు కోరుతున్నారు.

**ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే కఠిన చర్యలు..**

ప్రభుత్వ భూములు,చెరువులు,కుంటలు కబ్జా చేస్తే క్రిమినల్ కేసులతో పాటు వాల్టా ఉల్లంఘన కేసులు నమోదు చేస్తామని ఆర్డీవో రాంమూర్తి,ఇరిగేషన్ ఈఈ వెంకట క్రిష్ణారావు హెచ్చరిస్తున్నారు.ప్రస్తుతం అధికార యంత్రాంగం ఎన్నికల విధుల్లో నిమగ్నమై ఉన్నదని,ఎన్నికల తర్వాత కబ్జాకు గురైన ప్రభుత్వ భూములపై చట్ట ప్రకారం భూములను స్వాధీనం చేసుకునేలా ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు అధికారులు చెబుతున్నారు.



# సుజాత విద్యానికేతన్‌లో వరల్డ్ వాటర్ డే

**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** మండల కేంద్రంలోని సుజాత విద్యానికేతన్‌లో శుక్రవారం వరల్డ్ వాటర్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ఆకుతోట శాంతారాం కర్ణ మాట్లాడుతూ.. సకల జీవకోటికి ప్రాణాధారం నీరు నీరు లేక జీవకోటి మనుగడలేదన్నారు. ప్రతీ ప్రాణి జీవించడానికి పరిశుభ్రమైన నీరు అవసరం. ప్రతీ వ్యక్తి ప్రతీ రోజు ఐదు లీటర్ల నీరు తాగడానికి, వ్యక్తిగత అవసరాలకు 50 లీటర్లు, ఇంటి అవసరాలకు 200 లీటర్ల నీరు కావాలన్నారు. ప్రతీ నీటి బొట్టును పొదుపుగా వాడుకోవాలన్నారు. భూమిపై 70 శాతం ఉన్న నీటిలో 20 శాతం మాత్రమే మంచి నీరు, చెరువులు, బావులు, నదులు ఉన్నాయన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నీరు సరిపోవడం లోదని కావున ప్రతీ ఒక్కరూ నీటిని పొదుపుగా వాడుకోవాలన్నారు. మన దేశంలో బెంగళూరులో తీవ్ర నీటి కొరత ఎదుర్కొంటుంది. ఆఫీసులకు వెళ్లే వారికి సెలవు ఇవ్వడం, వర్క్ ఫ్రం హోం అవకాశం కల్పించడం, నీటి కొరతతో వంట చేసుకోకుండా హోటల్ భోజనాన్ని తెప్పించుకోవడం, స్నానం చేయకుండా గుడ్డతో తుడుచుకోవడం, నీటి వృథా చేసినట్లయితే రూ. 5000 జరిమానా విధించడం జరుగుతుందన్నారు. కావున ప్రతీ నీటి చుక్కను పొదుపు చేసి భావితరాలకు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గూడూరు లక్ష్మీ నారాయణ, ఉపాధ్యాయులు జూపాక నాగరాజు, వెంకట్, ప్రవీణ్, వెంకటేశ్వర్లు, పాల్గొన్నారు.



# మృతుని కుటుంబానికి పరామర్శ



**ప్రజాపక్షం/హసన్‌పర్తి:** గ్రేటర్ వరంగల్ 66వ డివిజన్ హసన్‌పర్తికి చెందిన పొరండ్ల యాదగిరి అనారోగ్యంతో మృతిచెందగా శుక్రవారం ఆయన మృతదేహం వద్ద వర్ధన్నపేట మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్ నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వీరి వెంట స్థానిక డివిజన్ కార్పొరేటర్ గురుమూర్తి శివకుమార్, నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

# నరేందర్‌రెడ్డిని కలిసిన మహ్మద్ అంకూస్



**ప్రజాపక్షం/కాజీపేట:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డిని తన కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మహ్మద్ అంకూస్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపినట్లు ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కాజీపేట పట్టణ అభివృద్ధి పనులను ఆయన దృష్టికి తీసుకెళ్లినట్లు చెప్పారు. ఆయనతో పాటు ఎన్ఎస్‌యూఐ సోషల్ మీడియా కో ఆర్డినేటర్ మహ్మద్ రహమతుల్లా తదితరులు ఉన్నారు.

# ఓటు హక్కును ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలి



**ప్రజాపక్షం/జఫర్గడ్:** జఫర్గడ్ ప్రతి ఒక్కరు నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలని స్టేషన్ ఘనపూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. శుక్రవారం జఫర్గడ్ మండల కేంద్రంలో బిఎల్ఓ లతో ఓటు హక్కు పై అవగాహన ర్యాలీ నిర్వహించి గాంధీ సెంటర్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రామ లోకసభ ఎన్నికల్లో ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా తమ నచ్చిన వ్యక్తికి ఓటు హక్కును వేసుకోవాలని సూచించారు. అంతేకాకుండా మీ ఓటు మీ భవిష్యత్తును నిర్ణయిస్తుందని మంచి వ్యక్తిని ఎన్నుకోవాలని నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహాసిల్దార్ ఆంజనేయులు, డిటి హరికృష్ణ, ఆర్ఐ అనిల్ కుమార్, పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ముంచిందే బీజేపి,బీఆర్ఎస్ ప్రభుత్వాలు



**ప్రజాపక్షం/కాజీపేట :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతు వ్యతిరేక విధానాలతో తెలంగాణ రైతాంగాన్ని నిట్టనిలువునా ముంచాయని తెలంగాణ రాష్ట్ర కో ఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ , గ్రోవర్స్ ఫెడరేషన్ కార్పొరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. కాజీపేట మీడియా పాయింట్ లో ఏర్పాటు చేసిన విలెకరుల సమావేశంలో జంగా రాఘవరెడ్డి మాట్లాడుతూ ఏనాడు రైతులకు ఇన్పుట్ సబ్సిడి ఇవ్వలేని బిఆర్ఎస్ నాయకులు రాష్ట్రంలో తిరుగుతూ రైతులపై మొసలి కన్నీరు కారుస్తున్నారని విమర్శించారు. మతం పేరుతో ఓట్లు పొందాలని బిజెపి ప్రభుత్వం బావిస్తుందని తెలంగాణ సమాజానికి కమ్యూనిస్టు భావజాలం ఎక్కువ అని ఇక్కడ బిజెపి నూకలు చెల్లవని దుయ్యబట్టారు. తెలంగాణ బిడ్డల త్యాగాల ఫలితంగా వచ్చిన తెలంగాణలో పదేల్లు కన్ను మిన్ను కానకుండా ప్రజలను దోచుకొని అస్తులు కూడబెట్టుకుని పార్లమెంటు ఎన్నికలకోసం బిఆర్ఎస్ నేతలు డ్రామాలు మొదలుపెట్టారని , పార్లమెంటు ఎన్నికల్లో 15 సీట్లు గెలుస్తామని రాహుల్ గాంధీని ప్రదాని చేస్తామని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సుంచు చంద్రయ్య, మాజీ కార్పొరేటర్ తొట్ల రాజు, గుజ్జుం కోటేశ్వర్, శ్రీనివాస్ రెడ్డి,కట్కూరి రమేష్,తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ అవార్డులు అందుకున్న లయన్స్‌క్లబ్ ప్రతినిధులు



**ప్రజాపక్షం/రాయపర్తి :** సమాజసేవ చేసినందుకు గాను లయన్స్‌క్లబ్ ఆఫ్ వర్ధన్నపేటకు ఉత్తమ అవార్డులు అందజేశారు. మండల కేంద్రానికి చెందిన లయన్స్‌క్లబ్ ఆఫ్ వర్ధన్నపేట అధ్యక్షులు రావుల అనిల్ కుమార్, కార్యదర్శి బుద్ద సునీల్ కుమార్, కోశాధికారి మధులు ఉత్తమ అవార్డులను జిల్లా గవర్నర్ వెంకటేశ్వర్లు చేతుల మీదుగా అందుకున్నారు. జెడ్‌సి మందాటి సుదర్శన్ రెడ్డికి ఉత్తమ జోన్ చైర్మన్‌గా అవార్డు అందజేశారు.ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ అధ్యక్షులు రావుల అనిల్ మాట్లాడుతూ మాజీ గవర్నర్ ముచ్చ రాజిరెడ్డి, క్లబ్ సీనియర్ నాయకుల ఆశీస్సులతో అవార్డులు రావడం జరిగిందనని అన్నారు.

# పశువులను పరిశీలించిన జిల్లా పశు వైద్య అధికారి



**ప్రజాపక్షం/మహాముత్తారం:**మండలంలోని కోనంపేట మరియు యామన్ పల్లి గ్రామాలలో పశువులకు గాలి కుంట వ్యాధి టీకాలు వేస్తున్న పశువులను జిల్లా పశు సంవర్ధక అధికారి డాక్టర్ బి.శ్రీదేవి పరిశీలించారు. శుక్రవారం కోనంపేట గ్రామంలో పశువులకు గాలి కొంకుడు వ్యాధి నివారణకు టీకాలు వేస్తున్న మండల పశు వైద్య అధికారి అభిషేక్ టీకాలు వేస్తున్న క్రమంలో జిల్లా పశువర్ధక అధికారి డాక్టర్ శ్రీదేవి నేరుగా అక్కడికి చేరుకొని పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ శ్రీదేవి మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ఉన్న పశువులన్నీటికి టీకాలు అందించాలని డాక్టర్ అభిషేక్ తెలిపారు. ఇప్పటివరకు 102 తెల్ల జాతి పశువులకు మరియు 56 నల్ల జాతి పశువులకు గాలికొంకుడు వ్యాధి నివారణ టీకాలు వేయడం జరిగిందని తెలిపారు. ఒకరోజు ముందు గ్రామానికి పశువులు ఉన్న ప్రతి రైతుకు తెలిసే విధంగా సమాచారం అందించడం జరుగుతుందని తెలిపారు. పశువులు ఉన్న ప్రతి రైతు వ్యాధి నివారణ టీకాలు వేయించుకొని సహకరించగలరని వాడు కోరారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య అధికారి డాక్టర్ అభిషేక్, పశు వైద్య సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# గాలికుంటూ వ్యాధి నిరోధ టీకాలు పశువులకు వేయించాలి



**ప్రజాపక్షం/నర్సంపేట:** గాలికుంటూ వ్యాధి నిరోధ టీకాలు పశువులకు వేయించాలని భాంజీపేట పశువైద్యాధికారి వింధ్య, జడ్‌పిటిసి కోమాండ్ల జయమ్మలు అన్నారు. నర్సంపేట మండలంలోని కమ్మపల్లి గ్రామంలో గోపాల మిత్ర సెంటర్‌లో పశువులకు ఉచితంగా గాలికుంటూ వ్యాధి నిరోధక టీకాలు వారు ప్రారంభించారు. ఈసందర్భంగా వింధ్య మాట్లాడుతూ రైతులు పశువులకు వేసే గాలికుంటూ టీకాలు వేయించుకోవాలని, దీంతో సీజనల్ వచ్చే రోగాలు పశువుల ధరిచేరవన్నారు. ఈకార్యక్రమంలో సిబ్బంది సత్యనారాయణ, జయరామ్, అన్వేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు విద్యార్థులు ఎంపిక



**ప్రజాపక్షం/వరంగల్ :** రాష్ట్ర స్థాయి సాఫ్ట్ బాల్ పోటీలకు గొర్రెకుంట పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయులు నలిమెల జ్యోతిర్మయి తెలిపారు. అనంతరం ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈసందర్భంగా జ్యోతిర్మయి మాట్లాడుతూ ఈనెల 17వ తేదిన వరంగల్‌లోని ఓసిటి క్రీడా ప్రాంగణంలో జరిగిన వరంగల్ జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్స్ స్థాయి (15 సంవత్సరాల విభాగం) గొర్రెకుంట పాఠశాల విద్యార్థులు ల్యాదళ్ల అక్షయ్, ల్యాదల్ల ప్రష్టిక్, నమిండ్ల వైభవ్‌లు పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యారు. ఈనెల 23, 24తేదిల్లో అలేరులో జరిగే రాష్ట్ర స్థాయి పోటిల్లో ఆడడం జరుగుతుందన్నారు. అనంతరం విద్యార్థులను, పిఇటి జలం రఘువీర్‌లను ప్రిన్సిపాల్ జ్యోతిర్మయి, కార్పొరేటర్ ఆకులపెల్లి మనోహర్‌లు అభినందించారు. ఈకార్యక్రమంలో ఉపాధ్యాయులు షాహిణ్, సుల్తానా, చంద్రశేఖర్, మార్త శ్రీనివాస్, అనిత, ప్రభాకర్, ప్రణిత కుమారి, దమరి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ప్రతి ఒక్కరి ధ్యేయం



**ప్రజాపక్షం/తొర్రూరు :** ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణే ప్రతి ఒక్కరి ధ్యేయమని టిఎస్ యుటిఎఫ్ మహబాదు జిల్లా అధ్యక్షులు మురళీకృష్ణ అన్నారు. ఉపాధ్యాయ ఉద్యమ ఆదర్శనేత, యుటిఎఫ్ వ్యవస్థాపక కార్యదర్శి, అమరజీవి అప్పారి వెంకటస్వామి వర్ధంతి సందర్భంగా శుక్రవారం మహబాదు జిల్లా తొర్రూరు డివిజన్ కేంద్రంలో యుటిఎఫ్ ఆద్వర్యంలో వెంకటస్వామి వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈసందర్బంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఉపాధ్యాయ లోకం అంతా ప్రాంతాల వారిగా, క్యాడర్ల వారిగా ఉపాధ్యాయ ఉద్యమం చీలిపోయిన సందర్భంలో అందర్నీ ఏకతాటిపైకి తెచ్చేందుకు ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్‌ను స్థాపించి అధ్యయనం, అధ్యాపనం, సామాజిక స్పృహ లక్ష్యాలుగా రాష్ట్రంలో అగ్రగామి సంఘంగా తీర్చిదిద్దారన్నారు. ప్రభుత్వ విద్యారంగ పరిరక్షణకు ఉద్యమాలు రూపొందించడంలో అప్పారి కీలక భూమిక పోషించారన్నారు. ఉద్యమ కార్యకర్తలలో మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా శాస్త్రీయ వైఖరులు పెంచడానికి పాటుపడ్డారన్నారు. పౌరుల్లో, విద్యార్థుల్లో శాస్త్రీయ దృక్పథం పెంచడం రాజ్యాంగం ప్రకారం ప్రతి ఒక్కరి బాధ్యత అని, అప్పారి స్పూర్తితో ఆవిధమైన కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో సంఘం జిల్లా కార్యదర్శి కె. బిక్షపతి, నాయకులు నాగమల్లయ్య, ఎర్ర వెంకన్న, బందు నారాయణ, వివిద మండలాల నాయకులు యాకూబ్, రంజిత్, నర్సింహాస్వామి, అజయ్, యాకయ్య, వంశీకృష్ణ, పార్వతి, చిరంజీవి, లింగరాజు, జనార్ధన్, చైతన్య, వనజ, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# బంధం చెరువు అధ్యక్షుడిగా పడిగే రాజు ముదిరాజ్



**ప్రజాపక్షం/గజ్వేల్ :** వర్గల్ మండలం చౌదర్ పల్లి బంధం చెరువు అధ్యక్షుడిగా పడిగే రాజు ముదిరాజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం స్పెషల్ ఆఫీసర్ రేఖ ఆధ్వర్యంలో బంధం చెరువు సొసైటీ చైర్మన్ ఎన్నికలు జరిగాయి. అలాగే వైస్ చైర్మన్ గా నర్సింలు, కార్యదర్శిగా కనకయ్య, డైరెక్టర్లుగా రవి, ఆగయ్య, పోచయ్య, వెంకటయ్య, చందర్రం, మహేష్ ఎన్నికయ్యారు.

## పుస్తకాలు, బిరువా వితరణ



ప్రజాపక్షం/గజ్వేల్: గజ్వేల్ మండలం బూర్గుపల్లి లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కు టీ వై ఆర్ ఫౌండేషన్ చైర్మన్ తలకొక్కుల రాజు ఆధ్వర్యంలో మూడు వందల పుస్తకాలు, ఒక బీరువాను పాఠశాల గ్రంథాలయానికి ప్రధానం చేశారు. ప్రధానోపాధ్యాయులు కృష్ణారెడ్డితో కలిసి టీఎస్ యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు సత్యనారాయణ మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన దీపికలని, విద్యార్థినీ విద్యార్థులకు గ్రంథాలయాలు ఎంతో ఉపయోగపడతాయని చెప్పారు. పాఠశాల గ్రంథాలయానికి పుస్తకాలు, బీరువా అందజేసిన తలకొక్కుల రాజుకు ధన్యవాదాలు తెలిపారు. అలాగే విద్యార్థినీ విద్యార్థులు చదువుతోపాటు, విజ్ఞాన సంపద కోసం జనరల్ నాలెడ్జ్ పుస్తకాలు చదవడం అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గ్రంథాలయ ఇంచార్జి శ్రీమతి సుధాశ్రీ, ఉపాధ్యాయులు ఏం.శ్రీనివాస్, టీ.శ్రీనివాస్ రెడ్డి, ఎండి.బషిరుద్దీన్, అర్జున్, శైలజ తదితరులు పాల్గొన్నారు.

## పొన్నంను విమర్శించే హక్కు బొమ్మకు లేదు



ప్రజాపక్షం/కొహెడః తెలంగాణ రాష్ట్ర రవాణా బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌పై విమర్శించే నైతిక హక్కు బొమ్మ శ్రీరామ్ చక్రవర్తికి లేదని వింజపల్లి మాజీ సర్పంచ్ శెట్టి సుధాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ మలిదశ ఉద్యమం కోసం పెప్పర్ స్ప్రే దాడికి గురై తెలంగాణను సాధించిన నాయకుడు పొన్నం ప్రభాకర్ అన్నారు. మాజీ ఎమ్మెల్యే బొమ్మ వెంకన్నకు నాలుగు సార్లు కాంగ్రెస్ పార్టీ పోటీ చేసే అవకాశం కల్పించిన గొప్ప పార్టీ కాంగ్రెస్ పార్టీ అని గుర్తు చేశారు.నీకు ఏమాత్రం రాజకీయ పరిజ్ఞానం లేకున్న బండి సంజయ్ దగ్గర మెప్పు కోసం తహతహలాడుతున్నవని విమర్శించారు.

## అమ్మ ఆదర్శ కమిటీలో దళిత మహిళలకు ప్రాధాన్యత ఇవ్వాలి



ప్రజాపక్షం/గజ్వేల్ : ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ మహిళ సంఘాల అధ్వర్యంలో ఆదర్శ కమిటీల ద్వారా నడపాలని ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న క్రమంలో అమ్మ కమిటీలలో దళిత మహిళలకు అవకాశం ఇవ్వాలని డిబిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరిగొండ స్వామి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ మండలం దాచారంలో పాఠశాలలో కమిటిల ఏర్పాటు గురించి తెలుసుకున్న సందర్భంగా ఆయన మాట్లాడారు. జిల్లాలో 636 ప్రాథమిక, 113 ప్రాథమికోన్నత, 227 ఉన్నత పాఠశాలల్లో అదర్శ అమ్మకమిటీల నిర్మాణంలో దళిత మహిళలకు సముచిత స్థానం కల్పించాలని స్పష్టం చేశారు. దళిత మహిళలకు ప్రధాన్యత ఇచ్చి కమిటీలు నిర్వహించబోయే మౌలిక సదుపాయలు కల్పన, బాలికల కొసం మరుగుదొడ్ల నిర్మాణం, త్రాగునీటి సౌకర్యం, తరగతి గదులలో విద్యుద్దీకరణ, పారిశుద్ధ్యం, సోలార్ ప్యానెళ్ళ ఏర్పాటు తదితర అంశాలలో భాగస్వామ్యం అయ్యే విధంగా దళిత మహిళలకు ప్రాదాన్యతనిచ్చి పిల్లలు ఎక్కువగా చదివేవిధంగాప్రోత్సహించాలనివివరించారు.

## క్రీడలతో మానసికోల్లాసం



ప్రజాపక్షం/నర్సంపేట: క్రీడలు మానసికోల్లాసానికి దోహదం చేస్తాయని టిపిసిసి సభ్యులు పెండెం రామానంద్ అన్నారు. నర్సంపేట పట్టణంలోని సర్వాపురంలో స్పెషల్ సెషన్2 ఆధ్వర్యంలో నర్సంపేట చంద్రుగొండ గ్రామాల మధ్య జరుగుతు క్రికెట్ పోటీలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై శుక్రవారం ప్రారంభించారు. అనంతరం క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఈసదర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్ యువత చేతిలోనే ఉందని, యువత సన్మార్గంలో నడవాలని కోరారు. చెడు వ్యసనాలకు బానిస కాకుండా యువత శారీరకంగా, మానసికంగా ధృఢంగా ఉండాలని సూచించారు. సర్వాపురం క్రికెట్ టీం సభ్యులకు టీషర్ట్స్ పెండెం రామానంద్ అందించారు. పెండెం రామానంద్, బత్తిని రాజేందర్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు బత్తిని రాజేందర్, నాయకులు కొప్పు అశోక్, పున్నం నర్సింహారెడ్డి, దోని చేరాలు, ఎర్రబెల్లి సందీప్, కొప్పు గాంధీ, ఈదుల రమేష్, ఎడ్ల రమేష్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి తుమ్మలపెల్లి సందీప్, నాయకులు పంబి వంశీ, చిప్ప నాగ, కోల చరణ్ రాజ్, బిట్ల మనోహర్, అప్పాల శ్రీకాంత్, ఎస్కే షఫిక్, కొప్పు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## బిజెపిలో చేరిన ఎంపిటిసి దేశెట్టి పాటిల్ బృందం



ప్రజాపక్షం/జహీరాబాద్: బీజేపీ పార్టీ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితుడినై స్థానిక పార్లమెంట్ సభ్యులు బిబి పాటిల్ గత పది సం రాలుగా జహీరాబాద్ అభివృద్ధి కోసం చేస్తున్న సేవలను చూసి బీజేపీ ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్ సమక్షంలో న్యాల్కల్ మండలంలోని గుంజేటి గ్రామా ఎంపిటిసి, జేకే చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక చైర్మన్ బొమ్మ దేశెట్టి పాటిల్ తన అనుచరగణంతో బీజేపీలో చేరానని తెలిపారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన ఎంపిటిసి దేశెట్టి పాటిల్ మాట్లాడుతూ జహీరాబాద్ పార్లమెంట్ లో ఎగరేది బీజేపీ జెండానే అని, స్థానిక ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్ రైల్వే స్టేషన్ల అభివృద్ధి, జాతీయ రహదారుల అభివృద్ధి కోసం 11 వెయ్యిల కోట్లకు పైగా నిధులు తేవడంలో సఫలం అయ్యారని, 2024 పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచి అంతకంటే రెట్టింపు నిధులతో అభివృద్ధి చేస్తారని బీజేపీ ఎంపిటిసి దేశెట్టి పాటిల్ అన్నారు. ఈ సందర్భంగా సమావేశంలో ఎంపీ అభ్యర్థి బిబి పాటిల్ మాట్లాడుతూ, గత పది సం రాలుగా జహీరాబాద్ నియోజకవర్గన్ని అభివృద్ధి చేశాననిఅన్నారు. గుంజేటి ఎంపిటిసి దేశెట్టి పాటిల్ సుమారు 100 మంది కార్యకర్తలతో కలిసి బిఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎంపీ బిబి పాటిల్ సమక్షంలో భారతీయ జనతా పార్టీలో చేరారు.

## ధర్మసాగర్‌లో ఘనంగా హనుమాన్ ఆలయ వార్షికోత్సవం



ప్రజాపక్షం/కౌడిపలి: మండల పరిధిలోని ధర్మసాగర్ గ్రామంలో శుక్రవారం హనుమాన్ ఆలయ ఎనిమిదవ వార్షికోత్సవం ఘనంగా అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. గ్రామ పురోహితులు కోలాచల రాజేశ్వర శర్మ, సుమన్ శర్మ ఆధ్వర్యంలో హోమం, గణపతి పూజ, చందన అలంకరణ అభిషేకం తదితరపూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పట్లోరి శ్రీనివాస రావు హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సత్యనారాయణ రెడ్డి, తిరుపతి రెడ్డి, యదగౌడ్, వడ్ల బ్రమ్మం, బాలగోని సంతోష్ గౌడ్, జగన్, మర్రి, శ్రీనివాస్, గోవిందుపల్లి రాజు, వడ్ల భిక్షపతి, మల్లేశం, రాజా గౌడ్, అశోక్, గౌడ్, రమేశ్ గౌడ్, నవీన్, శ్రీధర్, రమేష్, గ్రామ మహిళలు, భారీగా తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## శ్రీవాసవి మాత క్షేత్ర నిర్మాణానికి భూమి పూజ



ప్రజాపక్షం/గజ్వేల్ : గజ్వేల్ పట్టణ శివారులోని ఆర్య వైశ్య భవనం వద్ద శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయ నిర్మాణానికి భూమి పూజ జరిగింది. వేద పండితులు చాడ నంద బాల శర్మ ఆధ్వర్యంలో హోమాది పూజా కార్యక్రమాలు నిర్వహించగా, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి గుప్త శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్యవైశ్యుల కులదైవం శ్రీ వాసవి మాత ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేయడం సంతోషంగా ఉందని, నిర్మాణానికి సహకరిస్తున్న ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం బాధ్యులు కొమురవెల్లి శంకరయ్య గుప్త, సూర ఆంజనేయులు గుప్త, అత్తెల్లి లక్ష్మయ్య గుప్త, ఎర్రం శ్రీనివాస్ గుప్త, గోలి సంతోష్ గుప్త, అత్తెల్లి శ్రీనివాస్ గుప్త, ఉప్పల కృష్ణమూర్తి గుప్త, దొంతుల సత్యనారాయణ గుప్త, జగ్గయ్య గారి శేఖర్ గుప్త, ప్రభాకర్ గుప్త, ఎన్సీ సంతోష్ గుప్త, నాగేందర్ గుప్త, శివ కుమార్ గుప్త పాల్గొన్నారు.

## తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్యే



ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః సంగారెడ్డి ఎమ్మెల్యే చింతాప్రభాకర్ తిరుమల తిరుపతి వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్బంగా శ్రీవేంకటేశ్వర స్వామీ ఆశీస్సులతో సంగారెడ్డి నియోజకవర్గ ప్రజలంతా సుఖసంతోషాలతో ,ఆయురారోగ్యాలతో ఉండాలని కోరారు. స్వామి వారినిదర్శించుకున్న వారిలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ,రాజేందర్, కసాల బుచ్చిరెడ్డి ,శ్రీనివాస్‌గౌడ్,నాగన్నలు ఉన్నారు.

## చనిపోయిన చిన్నారి కుటుంబానికి కాంగ్రెస్ నాయకుల పరామర్శ



ప్రజాపక్షం/కౌడిపల్లి : మండల్ జాజి తాండ గ్రామ పంచాయతీలో ఇటీవల గాలి దుమారానికి పైకప్పు రేకుల ఎగిరిపోయి మూడేళ్ల చిన్నారి మాలోత్ సంగీత కుటుంబాన్ని మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు మాజీ ఎంపీపీ యాద గౌడ్ మండల్ కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో పరమర్శించారు నర్సాపూర్ ఇంచార్జ్ ఆవుల రాజిరెడ్డి సహకారంతో ఇందిరమ్మ ఇల్లు ఇప్పించడానికి కుటుంబానికి హామీ ఇవ్వడం జరిగింది. ఆరు లక్షలతో ఇల్లు మొదటి విడతలోనే అందేటట్లు చూస్తామని సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ యాద గౌడ్ నాయకులు అంబుర్య నాయక్ కాశమ్మ యాదగౌడ్ తునికి కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రభాకర్ చారి, వెంకటాపూర్, మల్లేష్ యాదవ్ కుషన్ అధ్యక్షుడు శంకర్ నాయక్ పాల్గొన్నారు.

## మెలారం ప్రభుత్వ పాఠశాలకు క్రీడా పరికరాల పంపిణీ



ప్రజాపక్షం/గణపురం: గణపురం మండలం లోని మైలారం ప్రభుత్వ పాఠశాలకు శుక్రవారం కురియా ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఆధ్వర్యంలో 50,000 విలువ చేసే క్రీడా పరికరాలను భూపాలపల్లి రూరల్ డెవలప్మెంట్ ట్రస్ట్ ఆర్డిటి స్వచ్ఛం ద సేవా సంస్థ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. ఈ సంస్థ గతంలో కూడా పాఠశాల కు సుమారు లక్షా యాభై వేల రూపాయల తో మైదానం చదును చేసి క్రీడా ప్రాంగణాన్ని సమతలం చేసినట్లు ఆర్డిటి సంస్థ కు చెందిన కె.లక్ష్మయ్య తెలిపారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎండి.అఫ్రోజ్ అహ్మద్ మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు ను దృష్టిలో పెట్టుకుని క్రీడా పరికరాలను సద్వినియోగం చేసుకుంటామని ఈ సందర్భంగా కురియా సంస్థ వారికి ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలుపుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులుఅఫ్రోజ్ అహ్మద్, ఉపాధ్యాయులు, కె.సరిత, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థుల అస్వస్థతకు కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి



ప్రజాపక్షం/జనగామటౌన్: మండలంలోని పెంబర్తి గురుకుల బాలికల పాఠశాలలో బాలికలు అస్వస్థతకు గురయ్యారని దీని కారకులపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ ఆద్వర్యంలో జిల్లా అదనపు కలెక్టర్‌కు శుక్రవారం మెమోరాండం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం మాట్లాడుతూ హాస్టల్‌లో ఉన్నతాధికారుల పర్యవేక్షణ కరువైందన్నారు. దీనికి హాస్టల్ వార్డెన్, ప్రిన్సిపల్ బాధ్యత వహించాలన్నారు. అదేవిధంగా ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది సరిగ్గా లేరని మండిపడ్డారు. ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీ యజమాని లైసెన్స్ రద్దు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సందీప్ పాల్గొన్నారు.

## మహిళ కుటుంబానికి ఆర్థిక సహాయం



ప్రజాపక్షం/హన్మకొండ టౌన్ : హన్మకొండ జిల్లా రెండో డివిజన్ లోని గుండ్ల సింగారం గ్రామానికి చెందిన భూక్య స్వప్న గత మూడు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె కుటుంబాన్ని రెండో డివిజన్ కార్పోరేటర్ లావుడ్యా రవి నాయక్ శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా స్వప్న కుటుంబానిక తక్షణ సహాయం కింద 50 కిలోల బియ్యాన్ని, ఆర్థిక సహాయాన్ని రవి నాయక్, కాలనీ వాసులు అందజేశారు.

## టేక్మాల్ మండల బిజెపి కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/టేక్మాల్:** టేక్మాల్ మండల బిజెపి పార్టీ కమిటీని శుక్రవారం మండల అధ్యక్షులు నవీన్ గుప్తా, జిల్లా కార్యదర్శి నాయికోటి శ్యామయ్య, ఫుల్ టైమర్ కృషి పండిట్ మాజీ మండల అధ్యక్షులు ఎల్లుపేట రాజు, శివ గౌడ్ ల సమక్షంలో మండల కమిటి నీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా కుమ్మరి సిద్ధిరాములు, రాములు, ఉపాధ్యక్షులుగా కే.దుర్గయ్య, ఎం.అంబయ్య, వి.రాములు, శేఖర్ గౌడ్, కార్యదర్శులుగా మోహన్, చంద్రశేఖర్, బేతయ్య, లింగం, నాగరాజు కోశాధికారిగా దుర్గాప్రసాద్, యువ మోర్చా అధ్యక్షులుగా పవన్ కుమార్, దళిత మోర్చా అధ్యక్షులుగా శంకర్, బీసీ మోర్చా అధ్యక్షులుగా శేఖర్, గిరిజన మోర్చా అధ్యక్షులుగా సేనాపతి కార్యవర్గ సభ్యులుగా అనిల్, శంకర్, శ్రీనివాస్, నాని, రమేష్ యాదవ్, సాయిరాం, కుమార్ సురేష్, ప్రభుకుమార్, ఆంజనేయులు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది.

## గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలి



**ప్రజాపక్షం/గణపురం:** వేసవి కాలం దృశ్య గ్రామాల్లో మంచినీటి ఎద్దడి లేకుండా చూడాలని డిఆర్డిఓ పిడి మండల స్పెషల్ ఆఫీసర్ నరేష్ అన్నారు. శుక్రవారం గణపురం మండల ప్రజా పరిషత్ కార్యాలయం లో పంచాయతీ కార్యదర్శుల తో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేసవికాలంలో నీటి ఎద్దడి లేకుండా ప్రతి గ్రామంలో నీటి కొరత లేకుండా హ్యాండ్ పంపులను రిపేర్ మరియు బోరు మోటార్లను రిపేర్ చేయాలని కోరారు. పైపు లీకేజీలు లేకుండా చూడాలన్నారు. అదే విధంగా ఉపాధి హామీ పథకంలో కూలీల సంఖ్యను పెంచాలన్నారు. అడిగిన వారికి పని కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ఎల్ భాస్కర్,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు పౌష్టికాహారాన్ని అందించాలి



**ప్రజాపక్షం/గణపురం:** గర్భిణీలకు బాలింతలకు అంగన్వాడీ కేంద్రాలలో పౌష్టికాహారాన్ని అందించాలని జిల్లా సంక్షేమ అధికారి నాగేశ్వరరావు సిడిపిఓ అవంతి అన్నారు శుక్రవారం గణపురం మండలంలోని పరుశురాం పల్లి అంగన్వాడీ కేంద్రం లో పోషకాహారంపై అవగాహన కల్పించారు. అంగన్వాడీ కేంద్రాలకు పిల్లల్ని పంపించడం వల్ల ఆట పాట లతో కూడిన మెరుగైన విద్య అందుతుందని, వారి ఆరోగ్యం పట్ల శ్రద్ధ తీసుకుంటారని అన్నారు. చైల్డ్ హెల్ప్ లైన్ నెంబర్ల గురించి, బాల్య వివాహాలు చేయడం వల్ల వచ్చే సమస్యల గురించి, మహిళా హక్కుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజరు లక్ష్మి, కోఆర్డినేటర్ అనుష, జెండర్ స్పెషలిస్ట్ మమత, కౌన్సిలర్ శైలజ, తిరుమల, అకౌంటెంట్ సురేష్, కేసు వర్కర్ సాయిరామ్,అంగన్వాడీ టీచర్లు వసంత, మానస, నవ్య,ఆయా సునీత,ఆశా, గ్రామస్తులు పాల్గొన్నారు.

## మాజీ సైనికుల ముఖాముఖి సమావేశము

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ లో పనిచేసి రిటైర్ అయి సంగారెడ్డి ,మెదక్, సిద్దిపేట జిల్లాలో నిర్వహిస్తున్నా మాజీ సైనికుల యొక్క సమస్యలు తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి మద్రాస్ రెజిమెంటల్ సెంటర్ నుండి అధికారులు వచ్చి ఇక్కడ మాజీ సైనికులతో ముఖాముఖి కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ప్రాంతీయ సైనిక సంక్షేమాధికారి ఎస్ సత్యశ్రీ తెలిపారు. శుక్రవారం మాజీ సైనికుల ముఖాముఖి సమావేశం సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గల రిజినల్ సైనిక సంక్షేమ శాఖ కార్యాలయంలో అధిక సంఖ్యలో మాజీ సైనికులు వారికుటుంబ సభ్యులు హాజరైనారు.మాజీ సైనికులు అందరూ వారికి లబించే రాయితీలు అన్ని ఆన్ లైన్ ద్వారానే దరఖాస్తు చేసుకుంటారని వారికి సమయం కార్యాలయాలకు తిరగడం తప్పుతుందని అంతేకాకుండా వారికి లభించే అనేక రకాలుగా ఆర్థిక పరమైన అంశాలపై వివరించారు.

# కొడుకు మోసానికి స్థిర ఆస్తులను కోల్పోయిన వృద్ధదంపతులు




**ప్రజాపక్షం/నర్సాపూర్ :** వృద్ధుల గోడును విని తక్షణమే స్పందించిన గౌరవ న్యాయమూర్తి కె.అనిత చైర్మన్ మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ రోజున కౌడిపల్లి మండల్ వెంకట్రావు పేట గ్రామానికి చెందిన గండి లచ్చయ్య, గండి తులసమ్మ వృద్ధ దంపతులు మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ కోర్టును ఆశ్రయించి తన స్వయంగా సంపాదించుకున్న స్థిర చర ఆస్తులను నా కుమారుడు గండి మధుసూదన్ గౌడ్ మోసపూరితంగా తన పేరు మీద మార్చుకొని మా వృద్ధ దంపతులను రోడ్డుపాలు చేశాడని తలదాచుకోవడానికి నా సొంత ఇల్లుకు తాళం వేసుకొని ఇల్లు కూడా ఇవ్వకుండా మమ్ములను పట్టించుకోకుండా ఉన్నాడని న్యాయమూర్తి తో ఆవేదన వ్యక్తం చేస్తూ మా వృద్ధ దంపతులకు న్యాయం చేయమని ప్రాధేయ పడడంతో న్యాయమూర్తి అనిత తక్షణమే స్పందించి మండల్ లీగల్ సర్వీస్ కమిటీ నర్సాపూర్ ద్వారా నమోదైనటువంటి పి ఎల్ సి కేసును పరిశీలించి తక్షణమే వృద్ధ దంపతుల నుండి అక్రమంగా స్వాధీనం చేసుకున్నటువంటి ఇల్లును వృద్ధ దంపతులు తలదాచుకోవడానికి ఇంటి తాళాలను స్వాధీనం చేయించి వృద్ధ దంతులకు అప్పగించడం జరిగింది. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల్లో వృద్ధులను కన్న కొడుకులు, కూతుళ్లు, వారి ఆలనా పాలన సరిగా చూడకుండా ఇబ్బందులకు గురి చేస్తే సీనియర్ సిటిజెన్ చట్టం ప్రకారం కఠినంగా శిక్షించబడతారని, తల్లిదండ్రుల ద్వారా వచ్చినటువంటి ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు వృద్ధులను గౌరవిస్తూ వారి వారి కుటుంబంలో వృద్ధుల ఆలనా పాలన చూసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు.

# నిర్వాసితులను నిండా ముంచిన వెంకట్రాం రెడ్డికి బుద్ధిచెబుదాం



**ప్రజాపక్షం/గజ్వేల్ :** మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల నిర్మాణం పేరిట రూ వేల కోట్లు సంపాదించిన మాజీ కలెక్టర్ వెంకట్రాంరెడ్డికి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుదామని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం రిమ్మనగూడ శివారులోని ఓ రెస్టారెంట్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాజెక్టుల నిర్మాణంతో భూములు కోల్పోయిన నిర్వాసితుల త్యాగాన్ని గుర్తించి ఇచ్చిన హామీలను అమలు చేయాల్సిన అప్పటి కలెక్టర్ వెంకట్రాంరెడ్డి నిర్వాసితుల ఉసురుపోసుకున్నట్లు స్పష్టం చేశారు. ముంపు గ్రామాల ప్రజలకు మంచి అవకాశం వచ్చిందని, బిఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న ఆయనకు తగిన బుద్ధి చెప్పడంతో పాటు గ్రామాల్లో రానివ్వవద్దని పిలుపునిచ్చారు. అలాగే మాజీ కార్పొరేషన్ చైర్మన్లు గంగుమల్ల ఎలక్షన్ రెడ్డి, మడుపు భూంరెడ్డిలు మూడు దశాబ్దాలుగా పేద ప్రజలకు నిస్వార్థంగా సేవలు అందించగా, వారి సేవలను గుర్తిస్తూ కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అయితే పదవులు, అధికార కాంక్షతో ఎఫ్డిసి మాజీ చైర్మన్ వంటేరు ప్రతాపరెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరే ప్రయత్నం చేస్తుండగా, ఆయన చర్యలను తిప్పికొట్టి అవినీతి బాగోతాన్ని కాంగ్రెస్ పార్టీ అధిష్టానం దృష్టికి తెస్తామని వివరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, నరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, మోహన్, ఐలం యాదవ్, మోనగారి రాజు, రాములు గౌడ్, రమేష్ గౌడ్, శ్రీగిరి పల్లి కుమార్, శివారెడ్డి, అజ్గర్, అంజి యాదవ్, భగవంత రెడ్డి, బాబా, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులే బిఆర్ఎస్‌ను గెలిపిస్తాయి



**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి :** మెదక్ లోకసభ బిఆర్ఎస్ అభ్యర్థి, మాజీ కలెక్టర్,ఎంఎల్‌సి వెంకట్రామ్‌రెడ్డిని పార్టీ అధిష్టానం ప్రకటించటంతో పార్టీ గెలుపు ఖాయమైందని బిఆర్ఎస్ రాష్ట్ర నేతలు మచ్చ వేణుగోపాల్‌రెడ్డి అన్నారు. సిద్దిపేట జిల్లా కలెక్టర్‌గా పనిచేసి, జిల్లాను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన వెంకట్రామ్‌రెడ్డికి ప్రజల మద్దతు ఎల్లవేళల ఉంటుందన్నారు. శుక్రవారం సిద్దిపేట బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసినవిలేఖరుల సమావేశంలో టిఆర్ఎస్ నేతలు మెరుగు మహేశ్, ప్రభాకర్‌రెడ్డితో కలసి ఆయన మాట్లాడారు. మెదక్ బిఆర్ఎస్ అభ్యర్థిగా వెంకట్రామ్‌రెడ్డి పేరును ఖరారు చేయటం పట్ల హర్శం వ్యక్త ం చేశారు. మెదక్ పార్లమెంట్ స్థానానికి పోటీ చేసే పార్టీలకు కనీసం ఓటు అడిగే హక్కు లేదన్నారు. పదవుల కోసం పాకులాడే చరిత్ర బిజెపి అభ్యర్థి రఘునందన్‌రావుది అన్నారు. టిఆర్ఎస్ ఆవిర్భావం నుండి మెదక్‌లో గులాభి జెండ పాతింది బిఆర్ఎస్ పార్టీ అన్నారు. కెసిఆర్, హరీష్‌రావు కృషితోనే ఉమ్మడి మెదక్ జిల్లా అభివృద్ధిలో ముందు వరుసలో నిలిచిందన్నారు. వారు పూర్తి చేసిన ప్రాజెక్టులు, అభివృద్ధి పనులే బిఆర్ఎస్ పార్టీని గెలిపిస్తాయని దీమా వ్యక్తం చేశారు.అమలుకాని హామీలుఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఏ ఒక్క హామీనేరవేర్చలేదన్నారు. మెదక్ పార్లమెంట్‌న బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలు కష్టపడి పార్టీని గెలిపిస్తారన్నారు. ఈసమావేశంలో బిఆర్ఎస్ నేతలు కుంబాల ఎల్లారెడ్డి, యాదగిరి, రజనికాంత్, శ్యామ్, శ్రావణ్,రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# మెదక్ ఎంపీ టికెట్ పై టిఆర్ఎస్ నాయకులు హర్షం



**ప్రజాపక్షం/నర్సాపూర్:** నర్సాపూర్ మెదక్ పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలోత్వరలో జరగబోయే పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో భాగంగా టిఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థిని టిఆర్ఎస్ పార్టీ తరపున ఎమ్మెల్సీ వెంకట్రామిరెడ్డిని టిఆర్ఎస్ అధినేత మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట చంద్రశేఖర రావు ప్రకటించడంతో శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని టిఆర్ఎస్ నాయకులు మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డి కి ప్రకటించడం పట్ల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ అశోక్ గౌడ్ మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ఎంపీ అభ్యర్థి వెంకటరామిరెడ్డిని టిఆర్ఎస్ పార్టీ తరపున భారీ మెజార్టీతో గెలిపిస్తామని ఆయన అన్నారు. గతంలో ఆయన ఉమ్మడి జిల్లాలో కలెక్టర్ఎమ్మెల్సీగా పని చేశాడు. ఆయనకు ఈ జిల్లా మీద అనుభవం ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమ్ హుద్దీన్, మండల పార్టీ అధ్యక్షులు భోగ శేఖర్, నాయకులు నాగేష్, సత్యం గౌడ్, బాల్ రెడ్డి, రింగుల ప్రసాద్, నాగరాజు, రామ్ చందర్, సూరారం, నర్సింలు, జ్ఞానేశ్వర్, తదితరులు ఉన్నారు.

## ప్రజలు స్వచ్ఛమైన నీటిని ఉపయోగించాలి



**ప్రజాపక్షం/రఘునాథపల్లి:** మండల ప్రజలు శుద్ధమైన, స్వచ్ఛమైన నీటిని మాత్రమే ఉపయోగించి తమ ఆరోగ్యాలను కాపాడుకోవాలని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కమలహాసన్ అన్నారు. శుక్రవారం ప్రపంచ నీటి సంరక్షణ దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది కొరకు ఏర్పాటుచేసిన కార్యక్రమంలో వైద్యాధికారి పాల్గొని నీటి సంరక్షణ పట్ల సిబ్బందికి అవగాహన కల్పించారు. శుక్రవారం నుండి 27వ తేదీ వరకు ఆరోగ్య ఉప కేంద్రాలలో పనిచేసే సిబ్బంది నీటి వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర సూపర్‌వైజర్‌లు బిక్కు నాయక్, ఝాన్సిరాణి, సులోచన, హెల్త్ అసిస్టెంట్ విష్ణువర్ధన్‌రెడ్డి, పాండరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాధితునికి 5 వేల ఆర్థికసాయం

**ప్రజాపక్షం/స్టేషన్ ఘనపూర్:** స్టేషన్ ఘనపూర్ డివిజన్ కేంద్రానికి మండల కేంద్రానికి చెందిన సాంబారి శ్రీనివాస్ ఇటీవల ప్రమాదవశాత్తు రెండు కాళ్ళను కోల్పోవడం జరిగింది. ఈ మేరకు శుక్రవారం టీపీసీసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సింగపురం ఇందిర ఆదేశాల మేరకు ఆమె కుమారుడు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యూత్ నాయకుడు సింగపురం ఇమాన్యుయల్ రాజు బాధితున్నీ అలాగే అతని కుటుంబ సభ్యులను పరామర్శించి 5 వేల రూపాయల ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు సింగపురం దయాకర్, మండల ప్రధాన కార్యదర్శి సింగపురం నాగయ్య, జిల్లా కార్యదర్శి చింత ఎల్లయ్య, మండల మహిళా కాంగ్రెస్ పార్టీ మహిళ మండలాధ్యక్షురాలు చింత జ్యోత్స్నా, నారగొని పద్మ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా పొట్లపల్లి జన్మదిన వేడుకలు



**ప్రజాపక్షం/స్టేషన్ ఘనపూర్ :** జనగామ జిల్లా స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ పరిధిలోని చిల్పూర్ మండలం పల్లగుట్ట గ్రామంలో లో జరిగిన శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్, బి ఆర్ ఎస్ పార్టీ సీనియర్ నాయకులు పొట్లపెల్లి శ్రీధర్ రావు జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి ముఖ్య అతిధిగా హాజరై కార్యకర్తలతో కలిసి పూల బొకే అందజేసి కేక్ కట్ చేసి శ్రీధర్ రావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్థులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## పుడ్ ఫాయిజన్ విద్యార్థులను పరామర్శించిన కొమ్మూరి ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/జనగామ ప్రతినిధి:** జనగామలోని పెంబర్తి గురుకుల పాఠశాలకు చెందిన ఐదుగురు విధ్యారులు కలుషిత ఆహారం తిని అనారోగ్యానికి గురై హాస్పటల్‌లో చికిత్స పొందుతుండగా శుక్రవారం కాంగ్రెస్ నాయకులు కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి పరమార్శించారు. జిల్లా హాస్పటల్‌లో విద్యార్థులను పరమార్శించి డాక్టర్ల ద్వారా వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లను కోరారు. వేసవి ఎండలు తీవ్రమైన నేపధ్యంలో విద్యార్థులు ఆనారోగ్యానికి గురయ్యే ప్రమాదం ఉన్నందున అధికారులు నిత్యం పర్యవేక్షించడంతో పాటు నాన్యమైన ఆహారం అందించాలన్నారు. హాస్పటల్‌ను సందర్శించిన విద్యార్దులను పరమార్శించిన వారిలో పిఎసిఎస్ ఛైర్మన్ నిమ్మతి మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ కాగితాపురం మహేందర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు బనుక శివ రాజ్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు లింగాల నర్సిరెడ్డి, బాల్ రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# రాష్ట్ర దూపదీప నైవేద్య సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుగా బస్వలింగప్ప



**ప్రజాపక్షం/పాపన్నపేట:** పాపన్నపేట మండల పరిధిలోని కుర్తివాడ గ్రామ శివారులోని శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి ఆలయ పూజారి దూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మఠం బస్వలింగప్ప నియమితులయ్యారు. ఈమేరకు రాష్ట్ర అధ్యక్షులు దౌలతాబాద్ వాసుదేవ శర్మ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని తెలంగాణ సారస్వత పరిషత్తు ఆడిటోరియంలో జరిగిన ప్రమాణ స్వీకారంలో రాష్ట్ర ఉపాధ్యక్షునిగా చోటు కల్పించినట్లు ఆయన పేర్కొన్నారు. అనంతరం నూతన క్రోధి నామ సంవత్సర పంచాంగాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బస్వలింగప్ప మాట్లాడుతూ.. తనపై నమ్మకం ఉంచి పదవిని కట్టబెట్టినందుకు జిల్లా అధ్యక్షులు షాలాక రాజేశ్వర శర్మ, జిల్లా, రాష్ట్ర కార్యవర్గానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వెల్లడించారు. తనకు ఈ పదవిని కట్టబెట్టినందున పదవికి తగిన న్యాయం చేస్తానని ఆయన తెలిపారు. కాగా యూసుఫ్ పేట శివాలయం పూజారి రాజలింగం గారి రమేష్ శర్మను రాష్ట్ర దూపదీప నైవేద్య సంఘం కార్యవర్గంలో సహాయ కార్యదర్శిగా చోటు కల్పించగా, వెల్దుర్తి మండల పరిధిలోని బస్వాపూర్ మల్లిఖార్జున స్వామీ ఆలయ పూజారి మఠం బసప్పకు రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా నియమించినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా ప్రాంతాల దూప దీప నైవేద్య సంఘం అర్చకులు, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరమైన బావులను పూడ్చేదెప్పుడు



**ప్రజాపక్షం/నిజాంపేట్:** నిజాంపేట మండల పరిధిలోని నస్కల్ గ్రామంలో పాత బావులు ప్రమాదాన్ని తలపిస్తున్నాయి. ఈ మేరకు మస్కల్ గ్రామనికి చేరుకోవడంతో పాత బావి దర్శనమిస్తాది. రోడ్డు పక్కనే ఉన్న ఈ పెద్దబావి వచ్చిపోయే వాహనాలకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. గ్రామానికి రాంపూర్ రోడ్ ఎంబడి మరో పాడుబడిన బావి మూలమలుపు ప్రాంతంలో ప్రమాదం కరంగా ఉంది. ఎవరైనా కొత్త వ్యక్తులు వస్తే కంట్రోల్ కాక అదుపుతప్పి ఆ బావిలో పడే అవకాశం ఉన్నది. అదేవిధంగా గ్రామంలోని చర్చి ఏరియాలో గాజు బావి ఉన్నది పశువులకు చిన్నపిల్లలకు ప్రమాదం జరిగే అవకాశం ఉన్నది. మరొక్క గాజు బావి ఇళ్లకు ఆనుకొని ఉన్నది. ఇందులో కుక్కలు పందులు కోళ్లు పడి చనిపోయి వాటి దుర్వాసన ఇళ్లల్లోకి వ్యాపించి శ్వాస తీసుకోలేని స్థితిలో ఉంటుంది. ఈ నెలలో చిన్నపిల్లలు స్కూల్లో నుండి హాస్టల్లో నుండి ఇళ్లల్లోకి చేరుకుంటారు. కాబట్టి ఆడుతూ పాడుతూ వెళ్లే క్రమంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కాబట్టి సంబంధిత అధికారులు ఈ పాడుబడిన బావులు సందర్శించి పూడ్చే విధంగా చర్యలు చేపడతారని ప్రజలు కోరుకుంటున్నారు.

## ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ మహాజన సభ సమావేశం

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** ఉమ్మడి మెదక్ జిల్లా డీసీఎంఎస్ మహాజన సభ సమావేశం శుక్రవారం నాడు ఉదయం 11 గంటలకు సంగారెడ్డి లోని పాత కలెక్టరేట్ కాంప్లెక్స్ లో మెదక్ డీసీఎంఎస్ మహాజన సభ సమావేశము మల్కాపురం శివకుమార్ అద్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సమావేశమునకు ఉమ్మడి మెదక్ జిల్లాలోని సహకార సంఘముల అద్యక్షులు డీసీసీ అధ్యక్షులు చిట్టీ దేవేందర్ రెడ్డి డీసీఎంఎస్ ఉపాధ్యక్షులు అరిగె,రమేష్ కుమార్ మార్కుఫెడ్, డైరెక్టర్ జగన్మోహన్ రెడ్డి ,డీసీసీబీ డైరెక్టర్ అనంతరెడ్డి, డీసీఎంఎస్ డైరెక్టర్లు డీసీసీబీ డైరెక్టర్లు ,డీసీఎంఎస్ బిజినెస్ మేనేజర్ అంజనేయులు తదితరులు హాజరైనారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం శివకుమార్ మాట్లాడుతూ రైతు సంక్షేమానికి డిసిఎంఎస్ కృషి మహాజన సభ సమావేశపు అజెండా అంశముల తీర్మాణములు తీసుకున్నా చర్యలు డీసీఎంఎస్ మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మాణించారు. రైతు సంక్షేమానికి డిసిఎంఎస్ కృషి , మహాజన సభ సమావేశపు అజెండా అంశముల తీర్మాణములు తీసుకున్న చర్యలు డీసీఎంఎస్ మహాజన సభ ఏకగ్రీవంగా ఆమోదించి తీర్మాణించనైనది. గౌరవ సభ్యులు డీసీఎంఎస్ వ్యాపార అభివృద్ధికి వారి అమూల్యమైన సలహాలు,సూచనలు చేసినారు.




## గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం



**ప్రజాపక్షం/సంగారెడ్డి ప్రతినిధిః** కలెక్టరేట్ మినీ సమావేశ మందిరంలో జిల్లా రెవెన్యూ అధికారి పద్మజారాణి గుర్తింపు పొందిన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా ఎన్నికల నియమావళి పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ పార్లమెంటు ఎన్నికల ప్రవర్తన నియమావళి ఈ నెల 16 నుండి అమలులోకి వచ్చిందన్నారు. ఎన్నికల ప్రచారానికి సభలకు సమావేశాలకు వాహనాల అనుమతులు ,బహిరంగ సభలకు అనుమతులన్ని సువిధ ఆప్‌లోనే పొందాలని తెలిపారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలు తప్పని సరిగా పాటించాలని, ఉల్లంఘనకు పాల్పడరాదని తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలో ఓటర్లు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పూర్థిస్థాయిలో సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు తమ ప్రచార వివరాలను తెలియజేయాలని తెలపారు. ఎన్నికల ప్రవర్తన నియమావళి అతిక్రమించినట్లు సమాచారం ఉంటే ఫోటోలు,వీడియోలను ఈసీఐ కల్పించిన సి విజల్ ద్వారా పిర్యాదు చేయాలన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి ఎన్నికల ఖర్చులు వివరాల కోసం కొత్త బ్యాంకు ఖాతాను తెరావలని తెలిపారు. బ్యాంకు ఖాతాల ద్వారా జరిగిన జమ, ఉపసంహరణలు ,నగదు లావాదేవీలు ఖర్చుల రసీదుల వివరాలు, పూర్తిగా నమోదు చేయాలన్నారు. రిటర్నింగ్ అదికారి కార్యాలయంలో సహాయ ఎన్నికల పరిశీలకులు షాడో రిజస్టర్లో నమోదు చేస్తున్న లెక్కలతో సరి చూసుకోవాలన్నారు. ఈ సమావేశంలో ఏఓ పరమేష్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాషా తారసింగ్ ,అడివయ్య, రాములు ,శ్రీదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో మంచి నీటి సమస్య తల్లెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ సంగారెడ్డి ప్రతినిధిః** సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలకార్యాలయంలో శుక్రవారం నాడు మండలంలోని అన్ని గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఎంపిడిఓ జ్యోతిలక్ష్మి సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యంగా వచ్చే వేసవి కాలంలో మండలంలోని అన్ని గ్రామాలలో త్రాగునీరు ,మంచినీటి సమస్యలు తలెత్తకుండా అన్ని జాగ్రత్తలు తీసుకొని గ్రామాల్లోని ప్రజలకు ఏలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ జ్యోతిలక్ష్మి కార్యదర్శులు పాల్గొన్నారు.

## మరమ్మతులు చేపట్టాలి



**ప్రజాపక్షం/మల్లూర్:** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మల్లూర్ మండల కేంద్రమైన తాడిచర్లలోని గొల్లపల్లి, మేనంపల్లి మధ్యలో డ్రైనేజీ పై ఏర్పాటు చేసిన సిమెంట్ పైపు పగిలి ప్రమాదకరంగా మారింది. సిమెంట్ పైపు పగిలి ఇనుప చువ్వలు బయటకు వచ్చాయి. దీంతో ఈ రోడ్డు పై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. వెల్మలపల్లి, హనుమానగడ్డతో పాటు పలు పల్లెల వాసులు ఈ మార్గం గుండానే ప్రయాణం సాగిస్తారు. కొత్తగా వచ్చిన వారు, నడిచి వెళ్లే వారు కూడ గమనించనట్లయితే ప్రమాదం బారిన పడే అవకాశం ఉంది.వెంటనే అధికారులు స్పందించి పైపులను మార్చాలని పల్లె వాసులు కోరుతున్నారు.

## ప్రభుత్వ భూముల పరిరక్షణ కమిటీ ఏర్పాటు



**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** జగదేవ్‌పూర్‌లో అక్రమణకు గురవుతున్న ప్రభుత్వ భూముల పరిరక్షణ కోసం గ్రామస్థులు భూముల పరిరక్షణ కమిటీని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ అధ్యక్షులుగా మారుతి వెంకట్ నర్సింహారెడ్డి, కన్వీనర్‌గా సయ్యద్ మునీర్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ ఉపాధ్యక్షులుగా దాచారం కనకయ్య, మచ్చ నర్సయ్య, ప్రధాన కార్యదర్శి బింగి మల్లేశం, సంయుక్త కార్యదర్శి కొంపల్లి మహేష్,బింగి నర్సింలు, కొశాధికారి ఎండి జహంగీర్, సలహాదారులు మచ్చ నర్సింహా, భీంరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ బాల్‌నర్సయ్య, కలీం, బాల్‌నర్సయ్య, కొనమైన గిరిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

## నేటితో ముగియనున్నదరఖాస్తుల గడువు

**ప్రజాపక్షం/కొల్చారం:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 2024 25 విద్యా సంవత్సరానికి ఆరో తరగతి నుండి తొమ్మిదవ తరగతి వరకు, సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవడానికి మార్చి 23 ముగియనుందని కొల్చారం తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ జయలక్ష్మి ప్రకటన లో తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఏప్రిల్ 21న పరీక్షలు నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ జయలక్ష్మి పేర్కొన్నారు.

## ఆలయ అభివృద్ధికి సహకరిస్తా



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** అల్లాదుర్గంలో శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయం లో ధ్వజస్తంభ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శుక్రవారం ఆఖరి రోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో జహీరాబాద్ బిజెపి ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని ధ్వజస్తంభ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొని తీర్థ ప్రసాదములు స్వీకరించారు. ఆలయ కమిటీ ఎంపీ గారిని ఘనంగా స్వాగతం పలికి సన్మానం చేశారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉండాలని భగవంతుని అనుగ్రహం వచ్చే ఎన్నికల్లో బిజెపి పార్టీని ఆదరించాలని భగవంతుని వేడుకున్నారు. కార్యక్రమంలో ఎంపీపీ అనిల్ కుమార్ రెడ్డి, అంజి యాదవ్, సంపత్ కుమార్, బసవరాజ్, బిజెపి నాయకులు అందోల్ కో కన్వీనర్ కాల రాములు, మండల అధ్యక్షులు యాదగిరి, కంచరి బ్రహ్మం, ప్రధాన కార్యదర్శి సాయిలు గౌడ్, నందన్ గౌడ్, భూమయ్య రమేష్, రవి, బేతయ్య, తదితరులున్నారు.

## ప్రజల శ్రేయస్సు పోలీసుల కర్తవ్యం



**ప్రజాపక్షం/అల్లాదుర్గం:** పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా జిల్లా ఎస్పీ బాలస్వామి ఆదేశాల మేరకు శుక్రవారం మండల పరిధిలోని రెడ్డిపల్లి గ్రామంలో సిఐఎస్ఎఫ్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. సందర్భంగా సిఐ రేణుక మాట్లాడుతూ ప్రజల శ్రేయస్సు పోలీసుల కర్తవ్యం అన్నారు. ఒకరినొకరు సహకరించుకుంటూ శాంతియుతంగా ఎన్నికలు జరిగేలా సహకరించాలని, అల్లర్లు, ప్రలోభాలకు గురి చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధమని దీనిని సద్వినియోగపర్చుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై ప్రవీణ్ రెడ్డి, సిఐఎస్ఎఫ్ బలగాలు, పోలీసులు పాల్గొన్నారు.

## అందరు కలిసిమెలిసి కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి పనిచేయాలి



**ప్రజాపక్షం/పాలకుర్తి:** రాబోయే పార్లమెంటు, స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తలు అందరు కలిసిమెలిసి పార్టీ అభివృద్ధికి పని చేయాలని బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని కాంగ్రెస్‌పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని ప్రక్షాళన చేసి బలోపేతం చేసేందుకే ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ఝాన్సిరెడ్డిల ఆదేశాల మేరకే గ్రామ పార్టీ అధ్యక్షులు, నాయకుల నిర్ణయం మేరకే మార్పులు చేర్పులు చేపడుతున్నామన్నారు.దేవరుప్పుల మండల అధ్యక్షునిగా శ్రీరాములు నియామకం గ్రామపార్టీ అధ్యక్షుల అభిప్రాయ సేకరణ తర్వాతే నియమించినట్లు తెలిపారు. కష్ట కాలంలో పనిచేసిన కార్యకర్తలందరికీ గుర్తింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో దేవరుప్పుల, కొడకండ్ల మండల పార్టీ అధ్యక్షులు నల్ల శ్రీరాములు, సురేష్, నాయకులు గంగు కృష్ణమూర్తి, రాఘవ రావు, జలగం కుమార్, బైరు భార్గవ్, హరీష్, నీరటి చంద్రయ్య, శ్రీనివాస్, సురేష్, ఎల్లయ్య, పాండు, కృష్ణ, భాస్కర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ నాయకుల ఆరోపణలలో నిజం లేదు...



**ప్రజాపక్షం/సిద్దిపేట అర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలంలోని పోన్నాల రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్ 21(19)లోఉన్న స్థలం కబ్జాకు గురైందని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలలో ఎటువంటి వాస్తవం లేదని అవన్నీ నిరాధారమైనటువంటి ఆరోపణలే అని పట్టాలు పొందిన లబ్దిదారులతోపాటు ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకులు తెలిపారు. శుక్రవారం సిద్దిపేట అర్బన్ మండలం పోన్నా డబుల్ బెడ్‌రూం ఇండ్ల సమీపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ బిఆర్ఎస్ నాయకుడు, రెవెన్యూ అధికారి అండతో కబ్జా చేసి అమ్ముకున్నారని కాంగ్రెస్ నాయకులు చేసిన ఆరోపణలలో వాస్తవం లేదని, 2022 సంవత్సరంలోనే అబ్దిధారులకు అప్పటి మంత్రి ప్రస్తుత ఎంఎల్ఎ హరీశ్‌రావు చేతుల మీదుగా అప్పటి మండల రెవెన్యూ అధికారి విజయ్‌సాగర్ ఆధ్వర్యంలోనే పట్టాలను పంపిణీ చేసినట్లు వారు తెలిపారు. తాము ఎవరికి ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని ఎవరి వద్ద కొనుగోలు చేయలేదని ప్రభుత్వం నుండే పట్టాలు పొందామని లబ్దిదారులు తెలిపారు. స్థానిక నాయకులు కెకె రావు, తన్నీరు శ్రీనివాస్ మాట్లాడుతూ నిరాధామైనటువంటి ఆరోపణలు చేస్తూ మనోవేధనకు గురి చేస్తున్నారని, నిరాధారమైన ఆరోపణలు చేసిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేస్తామని తెలిపారు. పట్టాలు పంపిణీ చేసింది 19 సర్వే నంబర్ అయితే 21సర్వే నంబర్‌లో కబ్జా చేశారని ఆరోపించడం సరైంది కాదని అన్నారు.

## రెవెన్యూ ఆఫీసర్ల మూలంగా రైతు ఆత్మహత్య



**ప్రజాపక్షం/బచ్చన్నపేట:** మండలంలోని పడమటి కేశవాపూర్ గ్రామానికి చెందిన రైతు కొమ్మాట రఘుపతి (45) శుక్రవారం వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో రైతు కుటుంబ సభ్యులు, గ్రామస్థులు రైతు మృతదేహంతో రెవెన్యూ కార్యాలయం ఎదుట న్యాయం జరుగాలని ధర్నా ఆందోళనకు దిగారు. ఈ విషయంపై బాధిత కుటుంబం తెలిపిన వివరాల ప్రకారం పడమటి కేశవాపూర్ గ్రామానికి చెందిన రైతు కొమ్మాట రఘుపతి పేరిట కొన్నె రెవెన్యూ శివారులో సర్వే నెంబర్ 75, 76లో ఉండబడిన 130 గుంటల భూమి ఉన్నారు. దీనిలో 100 భూమి రికార్డుకు రావడం లేదని సీనియర్ అసిస్టెంట్ కొలిపాక సుమన్, సర్వేయర్ కె రవీందర్‌ను దీన్ని రికార్డుకు ఎక్కించాలని రైతు కోరగా అధికారులు రూ.6లక్షల లంచం ఇవ్వమనగా రైతు బతిమిలాడి రూ.4.5లక్షలకు గత 15 నెలల క్రితం ఒప్పందం చేసుకొని రెండు దఫాలుగా డబ్బులను ఇవ్వడం జరిగిందన్నారు. దీంతో రైతు అప్పటి నుండి సీనియర్ అసిస్టెంట్, సర్వేయర్‌ల చుట్టూ తిరిగినా పని కాలేదని దీంతో విసుగు చెందిన రైతు అధికారులను నిలదీయగా భూమి కోర్టు వివాదంలో ఉందని రికార్డు చేయడం కాదని తేల్చిచెప్పడంతో రైతు అవాక్కయ్యాడని తన డబ్బులు తనకు ఇవ్వాలని డిమాండ్ చేసినప్పటికీ వారు ఇవ్వలేదన్నారు. దీంతో అప్పటికే తమ పెద్ద కూతురు వివాహం చేసి, ఇటు డబ్బులు రాక రఘుపతి తీవ్ర మనస్తాపం చెంది ఆత్మహత్యకు పాల్పడ్డారని తెలిపారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితుని భార్య కొమ్మాట శ్యామల ఫిర్యాదులో పేర్కొన్నారు. అనంతరం తహశీల్దార్ విశాలాక్షి మాట్లాడుతూ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి రైతు కుటుంబానికి న్యాయం జరిగేలా చూస్తామన్నారు. బాధ్యులపై చర్యలు తప్పవని తహశీల్దార్, ఎస్ఐ కంకల సతీష్ కుమార్‌లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమంలో సీపీఎం నాయకులు సుంచు విజయేందర్, బెల్లంకొండ వెంకటేష్, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు, మృతుని బంధువులు, రైతులు పాల్గొన్నారుపాల్గొన్నారు.

## విద్యుత్ సిబ్బందితో అవగాహన సమావేశం



**ప్రజాపక్షం/భీమదేవరపల్లి:** హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి విద్యుత్ శాఖ సబ్ డివిజన్ పరిధిలో సిబ్బందికి విద్యుత్ సరఫరాపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం ఈ సమావేశానికి రూరల్ డివిజన్ ఇంజనీరు సామ్యా నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ అవసరాలకు 24గంటల విద్యుత్ ఆటంకం లేకుండా చర్యలు చేపట్టాలన్నారు. గృహజ్యోతి పథకంలో నమోదు కానీ వారు ఏలాంటి ఇబ్బంది పడవలసిన అవసరం లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తి కాగానే వారికి కూడా పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో భీమదేవరపల్లి ఏడిఇ రాజు, ఏఇ లక్ష్మ న్ నాయక్, కొత్తకొండ ఏఇ శిరీష్, వేలరు ఏఇ కుమారస్వామి, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వభూమి కబ్జా చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి...



**ప్రజాపక్షం/సిద్దిపేటఅర్బన్:** సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల సమీపంలోని సర్వేనంబర్ 21లో ఉన్న ప్రభుత్వభూమిని పొన్నాలకు చెందిన బిఆర్ఆర్ నాయకుడు కబ్జా చేశాడని దీనికి అప్పటి రెవెన్యూ అధికారి సహకరించారని సిద్దిపేట కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు అత్తూ ఇమామ్ ఆరోపించారు. పోన్నాల గ్రామంలోని సంబంధిత స్థలాన్ని పరిశీలించి అనంతరం అత్తూ ఇమామ్ మాట్లాడుతూ 21సర్వే నంబర్‌లో సుమారు 18 గుంటల భూమిని కబ్జా చేశారని ఆరోపించారు. కబ్జా చేసిన స్థలాన్ని ఫ్లాట్లు చేసి అమ్ముకున్నారని బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అధికారి చూస్తూ ఉండిపోయాడని అన్నారు. భూకబ్జా వ్యవహారంలో సంబంధిత అధికారి,నాయకుడిపై పూర్తిస్థాయిలో విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణ యువజన అధ్యక్షుడు గయాజ్ ఉద్దీన్,నాయకులు మహేష్,ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.

## టెక్స్‌టైల్ పార్కు భూములను పరిశీలిస్తున్న ఆర్డీవో దత్తు



**ప్రజాపక్షం/సంగెం:** సంగెం, గీసుకొండ మండలాల పరిధిలో కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు భూములను వరంగల్ ఆర్డీవో దత్తు, డీపీఓ దిలావర్ మహ్మద్ ఆబిద్ అలీ, నాయబ్ తహసీల్దారు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం ఆర్డీవో దత్తు, సంగెం తహసీల్దారు కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. మండలంలో నేషనల్ గ్రీన్ ఫీల్డ్ హైవే రోడ్డు ఎన్ని ఎకరాల భూములు పోతున్నాయని తహసీల్దారు రాజ్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

## నీటిని పొదుపు చేద్దాం భావితరాలకు అందిద్దాం




**ప్రజాపక్షం/వరంగల్ టౌన్ :** ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఏవివి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కొడిమాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నీటి పొదుపు పై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా ప్రముఖ పర్యావరణ వేత్త ఠాగూర్ రతన్ సింగ్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ నీరు ప్రాణకోటికి జీవధారమని దీనిని పొదుపు చేయవలసిన అవసరం ఎంతైనా ఉందని, లేనియెడల భవిష్యత్ తరాలకు మనం ఊహించలేని పరిణామాలు ఎదుర్కోవాల్సిన వస్తుందన్నారు. అప్పుడు నీటిపై వ్యక్తిగత, సామాజిక, జిల్లా స్థాయి, రాష్ట్రస్థాయి, దేశస్థాయిలో యుద్ధాలు జరిగే అవకాశం ఉందని ఇందుకు ప్రతి ఒక్కరూ నీటిని పొదుపు చేసి అందరికీ నీటిని అందే విధంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ చుట్టుపక్కల వారికి అవగాహన కలిగించి నీటిని పొదుపు చేయాలని అన్నారు. కోడిమాల శ్రీనివాసరావు మాట్లాడుతూ నీరు ప్రాణకోటికి ఎంతో ముఖ్యమని దీనిని సంరక్షించే అవసరం ఎంతైనా ఉందని ఈ సందర్భంగా విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ అధ్యాపకులు వీరేశలింగం, సామాజిక కార్యకర్తలు విజయరావ్, సర్వేశ్వరం ఆధ్యాపకులుపాల్గొన్నారు.